క్లుప్తంగా

ఎరుకుమాంబకు విశేష పూజలు



ఎరుకుమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వయంగా జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో జి.వి. రామాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ముందుగా గణపతి పూజ చేశారు. భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు జరిపారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించి ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు



జ్యోతి వెలిగించి వేడుకలు ప్రారంభిస్తున్న డాక్టర్ రామ్‌కుమార్

సీతంపేట: జాప్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులు ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు, లక్ష్మీగాయత్రి హాస్పిటల్ అధినేత డాక్టర్ కె.వి.రామ్‌కుమార్ జర్నలిస్టులను సత్కరించి, కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు సింగపల్లి శ్రీనివాస్, కీర్తన, ఆదినారాయణ, కనకరాజు, జర్నలిస్టు కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

30న రంజాన్‌పై సదస్సు

సీతమ్మధార: ముస్లింల పవిత్ర మాసం రంజాన్‌ను పురస్కరించుకుని ఈ నెల 30న ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం గాంధీ సెంటర్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నట్లు ఐఏఆర్ఎఫ్ చైర్మన్ నరవ ప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీ ప్రాంగణంలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్ వేదికగా ఆదివారం ఉదయం 10 గంటలకు రంజాన్ ప్రత్యేకతలపై సదస్సు జరుగుతుందని తెలిపారు. ఇదే రోజున తెలుగు వారికి ఉగాది, క్రైస్తవులకు ఎల్ఈఎస్‌టీ సీజన్ పునరుద్ధానం, ముస్లింలకు రంజాన్ పర్వదినాలు జరగనుండటంతో సర్వమత సమభావన ప్రాముఖ్యాన్ని తెలిపేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఆచార్య ఇక్బాల్, అబ్దుల్ రజాక్, ఆచార్య వి.బాలమోహన్‌దాస్, బ్రహ్మకుమారీస్ తదితరులు పాల్గొంటారని చెప్పారు. సదస్సులో అన్ని మతాల వారు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుదాఘాతంతో కార్మికురాలి మృతి

ఆరిలోవ: హనుమంతవాక వద్ద గోడ నిర్మాణ పనులు చేస్తుండగా ఓ కార్మికురాలు విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా.. హనుమంతవాక కొండవాలు ప్రాంతంలో జీవీఎంసీ అధికారులు కొద్ది రోజులుగా రక్షణ గోడ నిర్మాణ పనులు కాంట్రాక్టర్ ద్వారా జరుపుతున్నారు. ఈ పనుల్లో భాగంగా మంగళవారం గణపతి రంభ(59) అనే మహిళ వాటరింగ్ చేస్తుండగా.. డ్రిల్లింగ్ మిషన్ వైరు తగిలి విద్యుత్ షాక్‌కు గురైంది. దీంతో ఆమెను తోటి పనివాళ్లు విమ్స్‌కు తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. అక్కయ్యపాలెంలో కార్మికురాలు రంభ నివసిస్తూ రోజు ఇక్కడ గోడ పనులకు వస్తుండేవారు. ఆమె మృతి చెందడంతో బంధువులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థుల ప్రతిభ

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్స్‌లో నిర్వహించిన ఈ తరంగ్–2025 ఫెస్ట్‌లో భాగంగా జరిగిన ఆర్ట్ పోటీల్లో ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు ప్రతిభ చూపారు. డిపార్ట్‌మెంట్ విద్యార్థులు ఏడు బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులను ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు అభినందించారు. శతాబ్ది ఉత్సవాల్లో చిత్రకళా విభాగం విద్యార్థులు తమ కళా ప్రతిభతో ఆకట్టుకోవాలని సూచించారు.

సందడే.. సందడి

- పిల్లలు, పెద్దలతో అలరారుతున్న పార్కులు
- వ్యాయామాలు, వాకింగ్‌తో ఆరోగ్య పరిరక్షణ
- ఆటపాటలతో చిన్నారుల కోలాహలం
- సద్వినియోగమవుతున్న వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి చేసిన పార్కులు



బృందావన్ పార్కులో ఆడుతున్న యువత



51వ వార్డు సిద్ధార్థ పార్కులో చిన్నారుల సందడి



ఈస్ట్ పార్కులో జారుడు బల్లపై ఆడుతున్న చిన్నారి



బృందావన్ పార్కులో ఆడుతున్న చిన్నారులు, మహిళల వ్యాయామం



ఈస్ట్ పార్కులో వ్యాయామం చేస్తున్న దృశ్యం

మద్దిపాలెం: వేసవి వచ్చిందంటే చాలు పార్కుల్లో సందడి షురూ అయినట్టే. ఉదయం, సాయంత్రం వ్యాయామాలు, చిన్నారుల ఆటలు, మహిళల ఎక్సర్‌సైజ్‌లు, నడక వంటివి మామూలే. దీంతో వార్డుల్లో ఏ పార్కులో చూసినా సందడి వాతావరణం నెలకొంటోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఒక్కో పార్కు అభివృద్ధికి కనీసం రూ.20 లక్షలు ఖర్చు చేసి అభివృద్ధి చేశారు. ఓపెన్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌లు రూపొందించిన విషయం తెలిసిందే. ఒక్క ఏరియాలోనే కాకుండా గ్రీన్ బెల్ట్ ప్రాంతాల్లో కూడా ఓపెన్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. దీంతో ఉదయం **ఎంత పని** ఒత్తిడి ఉన్నా సాయంత్రం కాసేపు సేదదీరేందుకు అలా పార్కులకు చేరుకుంటున్నారు. ఈ క్రమంలో జీవీఎంసీ 49,50,51,53 వార్డుల్లోని పార్కుల్లో సందడి మొదలైంది. ఒక్కో వార్డులో కనీసం 4 నుంచి ఆరు, ఏడు వరకు పార్కులు ఉన్నాయి. వాటిని అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని పలువరు అభిప్రాయపడుతున్నారు. పార్కుల చుట్టూ మొక్కలు, బుద్ధుడి విగ్రహం.. అలాగే పెద్దలు వాకింగ్ చేసేందుకు వాకింగ్ ట్రాక్‌లు, పిల్లలకు ఆట పరికరాలు, కాలక్షేపం కోసం కూర్చునేందుకు వీలుగా బల్లలు ఏర్పాటు చేయడంతో ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తోంది. శుభ్రమైన వాష్‌రూమ్స్ కూడా కల్పించారు. ఉదయం 5 గంటల నుంచి వ్యాయామాలు, వాకింగ్ చేస్తున్నారు. ఆ సమయంలో మహిళలు, పిల్లల కంటే పురుషులు, వృద్ధులు ఎక్కువగా కనిపిస్తారు. అలాగే సాయంత్రం నాలుగున్నర నుండి రాత్రి ఎనిమిదన్నర వరకు పార్కులు తెరచి ఉండడంతో మహిళలు ఇంట్లో పనులు త్వరగా ముగించుకుని కాసేపు కాలక్షేపం కోసం అక్కడికి చేరుకుంటున్నారు. ఏది ఏమైనా పార్కులు ఆరోగ్యానికి బాగా ఉపయోగపడుతున్నాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

సంతోషంగా ఉంది

విశాలమైన పార్కులను అందంగా తీర్చిదిద్దారు. వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, చిన్నపిల్లలు ఆడుకునేందుకు వీలుగా ఆట పరికరాలు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. గత పాలకులు ఇంతటి అందమైన పార్కులు ఏర్పాటు చేయడం హర్షణీయం.

– సత్యనారాయణ, 50వ వార్డు, మాధవధార

చక్కటి వసతులు కల్పించారు

ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు పార్కుల్లో అన్ని వసతులు కల్పించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుందరీకరణలో భాగంగా ప్రతి వార్డులో పార్కులను అభివృద్ధి చేసి మంచి వాతావరణం అందించారు. అది కూడా బయటి జిమ్‌లకు వెళ్లే అవసరం లేకుండా అభివృద్ధి చేయడం గొప్ప విషయం.

– సంతోష్, 49వ వార్డు, మురళీనగర్

అలరించిన కథా కచేరీ



మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: సహృదయ సాహితీ ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో జరిగిన కథా కచేరీ అలరించింది. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ సమాజంలో చైతన్యం పాదుకొల్పే రచనలు కథలుగా రావాలన్నారు. పేదల జీవితాలు, సమస్యలను ప్రతిబింబించే రచనలు చేయాలని కోరారు. రచయిత కె.జి.వేణు కథానిక సాహిత్య విశ్లేషణపై ప్రసంగించారు. డాక్టర్ డి.వి. సూర్యారావు కథా సాహిత్యంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రచయితలు చిన సూర్యనారాయణ, వినయభూషణరావు, కొత్తూరు రమణ, జ్యోతిర్మయి, నిర్మాలాదేవి, శ్రీనివాసరావు, పరమేశ్వరరావు, కుమార్ తదితరులు తాము రచించిన కథలను చదివి వినిపించారు.

నూకాంబికకు జలాభిషేకం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కంచరపాలెం: ఊర్వశి కూడలి పరిధి బర్మాక్యాంప్‌లో వెలసిన నూకాంబిక అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్చకుడు శర్మ నేతృత్వంలో మహా జలాభిషేకం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి దంపతులు 108 కలశాలతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. అనంతరం పంచామృతాభిషేకాలు, విశేష పుష్పాలంకరణ, దూప దీప నైవేద్యాలతో పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

టిఫిన్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక శకటం

సీతమ్మధార: ఆర్టీసీ కాంప్లెక్స్ దరి వైఎస్సార్ సెంట్రల్ పార్క్ ఎదురుగా ఉన్న దుకాణంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వీఎంఆర్‌డీఏకి చెందిన శ్రీ సాయిరాం టిఫిన్ సెంటర్ నుండి బుధవారం ఉదయం 9.30 గంటలకు ఒక్కసారిగా పొగలు వెలువడ్డాయి. వెంటనే చుట్టుపక్కల దుకాణాల వారు అగ్నిమాపక సిబ్బందికి తెలియజేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఫ్రిడ్జ్ ద్వారా వచ్చిన షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. సంఘటనా స్థలానికి వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో అన్నమయ్య ఆరాధనోత్సవాలు



సత్యదేవ్‌ను సత్కరిస్తున్న చైతన్య బ్రదర్స్

సీతమ్మధార: తొలి తెలుగు వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య 522వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం చైతన్య మ్యూజిక్ అసోసియన్ ఆధ్వర్యంలో సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని షిర్డీసాయి మందిరంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జగద్గురు పీఠం డైరెక్టర్ ఆఫ్ సర్వీసెస్ చింతలపాటి సత్యదేవ్ మాట్లాడుతూ అన్నమయ్య కీర్తనలు భక్తిని, తత్వాన్ని ప్రబోధించడమే గాక వ్యక్తులను సంస్కరింప జేయడానికి, సామాజిక శ్రేయస్సుకు ఎంతో ఉపకరిస్తాయన్నారు. ఆచార్య పురుషులు, సద్గురువులు తమ తమ మార్గాల ద్వారా ఆయా సంప్రదాయాల రూపంలో చిరంజీవులై ప్రకాశిస్తుంటారని పేర్కొన్నారు. అన్నమయ్య ఆరాధనోత్సవాల్లో భాగంగా చైతన్య బ్రదర్స్ బి.కృష్ణమాచార్య, వారణాసి వేంకటేశ్వరశర్మ అన్నమయ్య విగ్రహానికి పంచామృతాభిషేకం, షోడశోపచార పూజ శాస్త్రోక్తంగా జరిపారు. చైతన్య బ్రదర్స్ తమ ప్రసంగాల్లో అన్నమయ్య కృషిని, సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి, బాలకృష్ణ ప్రసాద్ చేసిన కృషిని ప్రస్తుతించారు. వర్ధంతి సభలో సత్యదేవ్‌ను చైతన్య బ్రదర్స్ సత్కరించారు. కార్యక్రమ నిర్వహణకు గణపతిరాజు ఇందిర, సుసర్ల మంజుల, ఆరిజన్ హాస్పిటల్స్ జనరల్ మేనేజర్ పడిమి భాస్కర్, బి.ప్రసన్న సహకరించారు. చైతన్య బ్రదర్స్ వద్ద శిక్షణ పొందిన సంగీత విద్యార్థులు ఆలపించిన 30 అన్నమాచార్య కీర్తనలు శ్రోతలకు వీనులవిందు చేశాయి.

ఉగాది వేడుకల కరపత్రం ఆవిష్కరణ



ఉగాది వేడుకల కరపత్రం ఆవిష్కరిస్తున్న ధ్యాన మందిర కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా ఉన్న షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో ఈ నెల 30వ తేదీ నుండి జరుగనున్న ఉగాది వేడుకల కరపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఉగాది–శ్రీరామనవమి వేడుకలు ఈ నెల 30వ తేదీ నుండి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 6వ తేదీ వరకు ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఉగాది పర్వదినాన ఉదయం 7 నుండి 12 గంటల వరకు భక్తుల స్వహస్తాలతో సాయిబాబాకు క్షీరాభిషేకం, నవగ్రహారాధన, సాయంత్రం 5 నుండి సహస్ర నామార్చన, రాత్రి 7 నుండి పంచాంగ శ్రవణం, 8 నుండి సాయిబాబా గీతాలాపన (భజన) నిర్వహిస్తామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



షేక్ ఫిరోజ్ మృతదేహం

సీతమ్మధార: వివాహం కావడం లేదని మనస్తాపం గురైన ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. ఫోర్త్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. షేక్ ఫిరోజ్(30) అక్కయ్యపాలెం చిన్నూర్లు మసీదు ప్రాంతంలో నివసిస్తున్నాడు. ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అతడికి పెళ్లి కాకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ విషయమై పలుమార్లు తల్లిదండ్రులను బెదిరించాడు. బుధవారం రాత్రి 7.30 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇంట్లో విగత జీవిగా కనిపించిన కొడుకుని చూసి తండ్రి పెద్ద కేకలు వేయడంతో స్థానికులు చేరుకొని ఫోర్త్‌టౌన్ పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ జి.వెంకటరావు, హెచ్‌సీ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



బాపూజీనగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ రజని

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు బీఆర్‌టీఎస్ రహదారి బాపూజీనగర్‌లో జోన్–5 ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో అభివృద్ధి పనులకు బుధవారం వార్డు కార్పొరేటర్ చిల్ల రజినీ శంకుస్థాపన చేశారు. సుమారు రూ. 19 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు శ్యామల దీపిక, కార్తీక్ కుట్టా, వికాస్, కార్యకర్తలు, జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఫ్యూజ్ బాక్సులు



వైశాఖి స్పోర్ట్స్ పార్కు గోడను ఆనుకుని తెరిచి ఉన్న ఫ్యూజ్ బాక్స్

మురళీనగర్: మురళీనగర్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఫ్యూజ్ బాక్సులు ప్రమాదకరంగా మారాయి. చాలా చోట్ల కరెంట్ స్తంభాలకు అనుబంధంగా అమర్చిన ఈ బాక్సులు తుప్పుపట్టి పాడయ్యాయి. కొన్ని చోట్ల ఫ్యూజ్ బాక్సులు తెరిచి ఉంటున్నాయి. వీటి తలుపులు మూసే తీరిక విద్యుత్ శాఖ సిబ్బందికి లేకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. వైశాఖి స్పోర్ట్స్ పార్కు వంటి ప్రధాన ప్రాంతంలో కూడా ఇవి తెరుచుకుని ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఈ పార్కు సందర్శనకు ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నారులు అధిక సంఖ్యలో వస్తారు. రహదారులను ఆనుకుని ఉన్న ఫ్యూజ్ బాక్సుల వద్ద కనీస ప్రమాద నివారణ చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ చర్యలు తీసుకోవాలని మురళీనగర్ వాసులు కోరుతున్నారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ.14.12 లక్షలు



ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, శ్రీహరి సేవకులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు అమ్మవారి హుండీ లెక్కించారు. 37 రోజులకు గాను అమ్మవారికి ముడుపులు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.14,12,593 నగదు, 173 గ్రాముల 100 మిల్లీగ్రాముల బంగారం, 11 కేజీల 100 గ్రాముల వెండి వచ్చినట్లు ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. దుర్గాలమ్మ ఆలయ ఈవో పి.శేఖర్‌బాబు, సహాయ కమిషనర్ కార్యాలయం సీనియర్ సహాయకులు డి.జె. ప్రభ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. కంచరపాలెం పోలీస్ కానిస్టేబుల్ రాంబాబు, ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ, పూజారి వాసుపల్లి విజయమ్మ, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీవారి స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

చినవాల్తేరు ఆశ కార్యకర్తకు షోకాజ్ నోటీస్

- వివాదాస్పదంగా మారిన డీఎంహెచ్‌వో నిర్ణయం

మహారాణిపేట: చినవాల్తేరు యూపీహెచ్‌సీలో పనిచేస్తున్న ఒక ఆశ కార్యకర్తకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ జగదీశ్వరరావు షోకాజ్ నోటీస్ జారీ చేయడం వివాదాస్పదంగా మారింది. అలాగే డీఎంహెచ్‌వో బుధవారం ఆకస్మికంగా యూపీహెచ్‌ను సందర్శించి, అనంతరం ఆశ వర్కర్ సర్వే చేస్తున్న ప్రాంతానికి వెళ్లారు. సర్వే సమయంలో యూనిఫాం ధరించకపోవడం, అలాగే సర్వే సరిగా నిర్వహించడం లేదని ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రుతు సమస్యల కారణంగా యూనిఫాం వేయలేదని ఆమె చెప్పగా.. యూనిఫాం తప్పనిసరి అని డీఎంహెచ్‌వో స్పష్టం చేశారు. దీంతో యూనిఫాం వేసుకుంటానని చెప్పడంతో అక్కడి నుంచి డీఎంహెచ్‌వో వెళ్లిపోతూ.. అందరూ బాగా పనిచేయాలని సూచించారు. కాగా.. ఈ నెల 21న తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్లు డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. విధులకు గైర్హాజరై ఆందోళనలో పాల్గొనేలా అందరినీ ఈ ఆశ వర్కరే ప్రోత్సహించారని.. డీఎంహెచ్‌వో ఆమెకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. దీనిపై ఆమె వివరణ కూడా ఇచ్చారు.

సింహాచలం దేవస్థాన భూమి కబ్జా

- గణేష్‌నగర్ కొండవాలులో రేకుల ఇల్లు నిర్మాణం
- తహసీల్దారే ఆక్రమణకు దిగడంపై కలెక్టర్‌కు స్థానికుల ఫిర్యాదు



గణేష్‌నగర్‌లో అక్రమంగా నిర్మించిన రేకుల ఇల్లు

సీతమ్మధార: సింహాచలం దేవస్థానానికి చెందిన స్థలం కబ్జాకు గురైంది. ఏకంగా ఒక తహసీల్దారే ఈ భూమిని కాజేసే ప్రయత్నం చేస్తున్నారు. అనధికారికంగా ఈ స్థలంలో చిన్న ఇంటి నిర్మించేశారు. సింహాచలం దేవస్థాన అధికారులు ఈ నిర్మాణం వైపు కన్నెత్తి చూడకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. దీంతో స్థానికులు కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులోని వివరాల ప్రకారం.. జీవీఎంసీ 14వ వార్డు గణేష్‌నగర్ కొండవాలు ప్రాంతం శివారులోని ప్లాట్ నంబర్ 259లో పోలవరపు ప్రభావతి నివసిస్తున్నారు. ఈమె ఇంటి పక్కన సింహాచలం దేవస్థానానికి చెందిన ఖాళీ స్థలంపై ఆమెకు అక్క వరుసైన బత్తిన సుగుణ కన్ను పడింది. ఈమె ప్రస్తుతం విజయవాడలో తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. ఈ స్థలంలో రేకుల ఇంటిని నిర్మించారు. తహసీల్దార్ సుగుణ తన అధికారాన్ని ఉపయోగించి ఇంటికి పన్ను, నీటి పన్ను, విద్యుత్ కనెక్షన్ తీసుకున్నారు. ఈ విషయంపై కాలనీ వాసులు ప్రశ్నించగా.. అక్కాచెల్లెలు ఇద్దరూ కొంత మంది వ్యక్తులతో కలిసి బెదిరింపులకు పాల్పడినట్లు గణేష్‌నగర్ కాలనీవాసులు ఫిర్యాదులో పేర్కొన్నారు. సింహాచలం దేవస్థానం భూమిలో అక్రమంగా చేపట్టిన ఇంటి నిర్మాణంపై దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని లేఖ ద్వారా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

జోరుగా కల్వర్టు నిర్మాణం



గోశాలపాలెంలో గెడ్డపై నిర్మిస్తున్న కల్వర్టు

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు గోశాలపాలెంలో గెడ్డపై బాక్సు కల్వర్టు పనులు జోరుగా జరుగుతున్నాయి. పాత బ్రిడ్జి కింది భాగం, గోడలు శిథిలమవడంతో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి గత ప్రభుత్వంలో నిధులు మంజూరు చేశారు. దానికి మరికొంత నిధులు మంజూరు చేసి సుమారు రూ.50 లక్షలతో నెల రోజులుగా బాక్సు కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గెడ్డకు ఇరువైపులా కాంక్రీట్ పిల్లర్లు, గోడలు నిర్మించారు. శ్లాబ్ వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కల్వర్టు పనులతో గోశాలపాలెం వాసులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి రాకపోకలకు మార్గం సుగమం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జిల్లా కోర్టు అభివృద్ధికి సొంత నిధులు

- పోటీలో ఉన్న న్యాయవాదులు వెల్లడి

విశాఖ లీగల్: సొంత నిధులు ఖర్చు చేసైనా న్యాయవాదులకు ఉన్నత సేవలందిస్తామని పలువురు న్యాయవాదులు ప్రకటించారు. ఈనెల 28వ తేదీన జరిగే న్యాయవాదుల సంఘం ఎన్నికలకు సంబంధించి అఖిలభారత న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ప్రత్యేక చర్చా కార్యక్రమం చేపట్టారు. ఐలు అధ్యక్షుడు నూకల వెంకటేశ్వరరావు అనుసంధానకర్తగా వ్యవహరించారు. ఎన్నికల సంఘం అధ్యక్షుడు జీఎం రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వివిధ పదవులకు పోటీ చేస్తున్న న్యాయవాదులు తమ అజెండాను ప్రకటించారు. ఇందులో అధిక శాతం న్యాయవాదులు తమ సొంత నిధులు లేదా కార్పొరేట్ నిధులతో జిల్లా కోర్టు అభివృద్ధికి అంకితం అవుతామని తెలిపారు. ముఖ్యంగా అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న ఎంకే శ్రీనివాస్, ఐఎం అహ్మదీ, నమ్మి సన్యాసిరావు యాదవ్ తదితరులు ప్రసంగించారు. న్యాయస్థానాల్లో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలు, కాపీ సెక్షన్ సులభతరం చేయడం, క్యాంటీన్ లిఫ్ట్ వంటి సమస్యల పరిష్కారంపై మాట్లాడారు. ఈ సమావేశంలో పోటీదారులతో పాటు అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు